సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 6 । ఏప్రిల్ । 2024





## వలంటీర్ల రాజీనామా

నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తాము ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు బలై రాజీనామాలు చేస్తున్నట్టు వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. IIలో ▸



## నమాజులో ఆరోగ్య సూత్రాలు

ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆచరించే నమాజులో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయని పెద్దలు చెబుతున్నారు. IIలో ▸

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శనివారం (సాయంత్రం) | సహరి ఆదివారం (ఉదయం) |
|---|---|---|
| భీమవరం | 6.24 | 4.34 |
| ఏలూరు | 6.27 | 4.32 |

## న్యూస్‌రీల్

### నేడు ముద్రగడ తణుకు రాక

**తణుకు అర్బన్:** తణుకులో శనివారం నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం హాజరుకానున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు తణుకు జాతీయ రహదారి సమీపంలోని కమ్మ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. కాపు సోదరులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ముద్రగడ అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

### కవి ఎంఆర్‌వీకి పురస్కారం



అవార్డు అందుకుంటున్న ఎంఆర్‌వీ మూర్తి

**పెనుగొండ:** పెనుగొండకు చెందిన కవి, కథా, నాటక రచయిత ఎంఆర్‌వీ సత్యనారాయణమూర్తి స్వాతంత్ర్య సమరయోధుడు పడాల రామారావు స్మారక అవార్డు అందుకున్నారు. శుక్రవారం ఎంఆర్‌వీ పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా అభ్యుదయ రచయితల సంఘం సభలో సంఘ గౌరవ అధ్యక్షుడు రామారెడ్డి అవార్డు అందజేశారన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్, ఆదిత్య సంస్థల డైరెక్టర్ పి.గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారన్నారు. ఎంవీఆర్‌ను స్థానిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు, త్యాగరాజు గానసభ అధ్యక్షురాలు కె.అన్నపూర్ణ అభినందించారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

**భీమవరం(ప్రకాశంచౌక్):** జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన పోలింగ్ శాతం సాధించేందుకు ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 14,63,014 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఓటర్లకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, గతంలో ఘటనలు జరిగిన ప్రాంతాల్లో పోలీస్ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలంతా నిర్భయంగా ఓటు వేయవచ్చన్నారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటుచేశామన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోండి



జేసీ ప్రవీణ్ ఆదిత్య

**భీమవరం(ప్రకాశం చౌక్):** ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావడంతో పాటు ఓటు హక్కు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు హాజరైన వసతి గృహాల ఇంజనీరింగ్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వారి చదువు, వయసు వివరాలు తెలుసుకుని ఓటు ఎక్కడ ఉందని ఆరా తీశారు. 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని హితవు పలికారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు, ఓటర్ హెల్ప్‌లైన్‌పై వివరించారు. ఈనెల 14 వరకు ఓటు నమోదుకు గడువు ఉందన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా వీఓటీఈఆర్ఎస్. ఈసీఐ.జీఓవీ.ఇన్. లేదా సీఈఓఏపీఎన్ డీహెచ్ఆర్ ఏ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

### అంబులెన్స్‌లకు అధిక చార్జీలు సహించం


**భీమవరం(ప్రకాశం చౌక్):** జిల్లాలోని అంబులెన్స్ యజమానులు నిర్దేశిత చార్జీలకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు. అంబులెన్స్ యజమాను లు ఇష్టారంగా చార్జీలు వసూలు చేస్తున్నట్టు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై జిల్లా రవాణా అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కిలోమీటర్ల వారీగా చార్జీల పట్టికను విడుదల చేశామన్నారు. ఇంతకు మించి వసూలు చేస్తే ఊరుకోబోమన్నారు. చార్జీల పట్టిక వాహనంలో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద 300 మీటర్ల దూరంలో అంబులెన్స్‌లు పెట్టుకోవచ్చని, మానిటరింగ్ సెల్ ఏర్పాటుచేశామన్నారు. నిబంధనలు మీరితే 85008 14033, 93904 11784, 91542 94686కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ, ప్రజలకు మరింత మెరుగైన పాలనను చేరువ చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజన చేపట్టారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిని ప్రామాణికంగా తీసుకుని జిల్లాలను ఏర్పాటుచేశారు. దీనిలో భాగంగా ఏలూరు కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాను రెండుగా విభజించారు. భీమవరం కేంద్రంగా నూతన పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు కేంద్రంగా ఏలూరు జిల్లాలు ఏర్పడ్డాయి. 2022 ఏప్రిల్ 4న భీమవరం కేంద్రంగా నూతన పశ్చిమగోదావరి జిల్లాలో పాలన ప్రారంభమైంది. 19 మండలాలతో ప్రారంభమైన జిల్లాలో ఆ తర్వాత గణపవరం మండలం కూడా చేరడంతో 20 మండలాలకు చేరింది. ఈనెల 4న నూతన జిల్లా ఏర్పాటై రెండేళ్లు పూర్తిచేసుకుంది.

# పాలన రథం.. ప్రగతి అద్వితీయం

**'పశ్చిమ'లో నవశకం**

- కొత్త జిల్లాకు రెండేళ్లు పూర్తి
- ప్రజలకు మరింత చేరువైన పాలన
- అందుబాటులో అధికార యంత్రాంగం
- విపత్తుల వేళ సమర్థంగా సేవలు
- ఆక్వా వర్సిటీ, మెడికల్ కాలేజీలకు అంకురార్పణ
- స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



## అభివృద్ధి అడుగులు

- నూతన పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి సీఎం జగన్ విశేషంగా కృషిచేశారు.
- పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో మెడికల్ కళాశాల నిర్మాణం, నరసాపురం ప్రాంతంలో రూ.3 వేల కోట్లతో ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్, వాటర్ గ్రిడ్ తదితర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.
- జిల్లాలో 71,200 మంది పేదలకు ఇళ్లు మంజూరు చేసి గృహ నిర్మాణాలకు రూ.500 కోట్ల మేర ఖర్చు చేశారు.
- రైతుల కోసం రూ.10.56 కోట్లతో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం చేపట్టారు.
- రూ 455.59 కోట్లతో గ్రామ, వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా, విలేజ్ క్లినిక్‌లు నిర్మించారు.
- రూ.16.14 కోట్లతో పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించారు.
- రూ.86 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- రూ.9.12 కోట్లతో 32 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించారు.
- నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు.
- పట్టణాల్లో రూ.400 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేశారు.



**జిల్లా ముఖచిత్రం**

| | |
|---|---|
| జనాభా | 18,44,898 |
| విస్తరణ (చ.కి.మీ.) | 2,278.35 |
| రెవెన్యూ డివిజన్లు | 3 |
| మండలాలు | 20 |
| గ్రామాలు | 409 |
| మున్సిపాలిటీలు | 6 |
| ఓటర్లు | 14,61,337 |

నరసాపురంలో ఏర్పాటుకానున్న ఆక్వా యూనివర్సిటీ నమూనా చిత్రం



భీమవరంలో కలెక్టరేట్ భవనం

**భీమవరం (ప్రకాశం చౌక్):** కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేసింది. ప్రజలకు సంక్షేమం, పాలన మరింత చేరువ చేసింది. భీమవరంలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేయడంతో అధికార యంత్రాంగం కూడా అందుబాటులోకి వచ్చింది.

**తగ్గిన దూరాభారం :** భీమవరం కేంద్రం జిల్లా వాసులకు చేరువగా ఉంది. జిల్లాలోని ఏ మండలం నుంచి అయినా 30 కిలోమీటర్ల దూరంలో జిల్లా కేంద్రం ఉండటంతో ప్రజలకు దూరాభారం తప్పింది. గతంలో కలెక్టరేట్, జిల్లా కార్యాలయాలకు వెళ్లాలంటే ఏలూరుకు దాదాపు 80 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. ముఖ్యంగా కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు భీమవరం కలెక్టరేట్ అందుబాటులో ఉంది.

**అందుబాటులో అధికారులు :** జిల్లాలో ఏ ప్రాంతంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా వేగంగా అధికారుల వెళ్లి సాయం అందిస్తున్నారు. గోదావరి వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులు కూడా 30 నిమిషాల్లోపు సంఘటన ప్రాంతాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కొత్త జిల్లా ఏర్పాటుతో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్లు, పోలీస్ సబ్ డివిజన్‌లుగా ఏర్పడ్డాయి. దీంతో పాలనా వికేంద్రీకరణ జరిగి సత్వర సేవలు అందుతున్నాయి.

**విప్ గ్రంధి కృషి :** భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషి చేశారు. ఈ క్రమంలో ఆయన మంత్రి పదవిని సైతం వదులుకున్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో చురుకైన పాత్ర పోషించారు.

### చాలా మేలు జరిగింది



భీమవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు చాలా మేలు జరిగింది. గతంలో ఏ పని కోసమైనా ఏలూరు వెళ్లి రావాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో కొత్త జిలాలు ఏర్పాటయ్యాయి. పాలన, సంక్షేమం వేగంగా అందడంతో పాటు జిల్లాలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి.

– ఏఎస్ రాజు, భీమవరం

### వ్యయప్రయాసలు తగ్గాయి



జిల్లాల పునర్విభజనతో వ్యయప్రయాసలు తగ్గాయి. గతంలో మా గ్రామం నుంచి జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. కేవలం 8 కిలోమీటర్లలోనే జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నాం. స్పందన కార్యక్రమానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు చాలా వెసులుబాటు కలిగింది.

– బి.రాంబాబు, కొండేపూడి

### వేగంగా సేవలు



జిల్లాలోని 20 మండలాల ప్రజలకు పాలన మరింత వేగంగా, సులభంగా అందిస్తున్నాం. మూడో వసంతంలోకి అడుగుపెడుతున్న నూతన పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి కూడా వేగంగా జరిగేలా, ప్రజలకు అన్నివిధాలా జిల్లా అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు రెండో కలెక్టర్‌గా పనిచేయడం ఆనందంగా ఉంది.

–సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్

### చేరువైన సంక్షేమం



భీమవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేసిన రెండేళ్లలో పాలన, సంక్షేమం మరింత చేరువైంది. సీఎం జగన్ భీమవరాన్ని జిల్లా కేంద్రం చేయడాన్ని ఎప్పటికీ మరువలేం. ఇక్కడ ఆస్పత్రులు, రవాణా, ఉపాధి, వ్యాపార, విద్యా తదితర రంగాలు బాగా అభివృద్ధి చెందుతున్నాయి. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి జరుగుతుంది.

– గ్రంధి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

# బాబు కుట్రలకు చెంపపెట్టు

**మురిపించెన్**

- సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ
- జిల్లాలో 95 శాతం పూర్తి
- నడవలేని వారి ఇళ్లకే వెళ్లి అందజేత



తూర్పుపాలెంలో ఇంటి వద్దే పింఛన్ అందిస్తూ..



ఏలూరులో బయోమెట్రిక్ తీసుకుంటూ..

**భీమవరం (ప్రకాశం చౌక్):** ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజల పక్షాన నిలబడింది.. పండుటాకులను ఇబ్బంది పెట్టేలా ప్రతిపక్షాలు కుట్రలు పన్నినా.. వాటిని ప్రభుత్వం దీటుగా ఎదుర్కొంది.. సామాజిక పింఛన్ లబ్ధిదారులకు పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంది.. వలంటీర్లను ఇంటికే వెళ్లి పింఛన్ ఇవ్వకుండా కుతంత్రాలకు పాల్పడిన ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా సచివాలయ వ్యవస్థ ద్వారా పెన్షన్‌దారుల ఇళ్ల వద్దకు, సచివాలయాల వద్ద పెన్షన్లు పంపిణీ పక్కాగా చేయించింది. దీంతో జిల్లావ్యాప్తంగా మూడు రోజుల్లో 95 శాతం పింఛన్ పంపిణీ పూర్తయ్యింది.

**ప్రత్యేక దృష్టితో..** వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్ల పంపిణీని అడ్డుకునేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు కుట్రలు పన్నాయి. వీటిని గుర్తించిన ప్రభుత్వం పెన్షన్‌దారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. ఈనెల 3వ తేదీన పెన్షన్ల నగదును ఆయా సచివాలయాలకు జమ చేయించి తక్షణమే జిల్లా అధికారుల సమన్వయంతో సచివాలయ సిబ్బంది, బ్యాంకర్లు కలిసి పెన్షన్లను పక్కాగా పంపిణీ చేయించేలా చర్యలు తీసుకుంది. జిల్లా యంత్రాంగం మూడు రోజులపాటు పెన్షన్ల పంపిణీపై దృష్టి సారించి వృద్ధులు, దివ్యాంగులు, మంచంపై లేవలేని పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి నేరుగా వారి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు అందించే ఏర్పాట్లు చేసింది.

**సచివాలయాల వద్ద ఏర్పాట్లు :** పింఛన్ లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. సచివాలయాల వద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటికి ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 2,34,884 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వారికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.69 కోట్లు అందిస్తోంది. ఇప్పటివరకు 2,19,246 మంది లబ్ధిదారులకు రూ.65.60 కోట్లు పంపిణీ చేసి 95 శాతం పంపిణీ పూర్తిచేసింది. శనివారం మధ్యాహ్నం నాటికి నూరు శాతం పెన్షన్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

**ఇంటికే వెళ్లి..**

జిల్లాలో అనారోగ్యంతో, నడవలేని స్థితిలో మంచంపై ఉన్న లబ్ధిదారులు, దివ్యాంగులు సుమారు 10 వేల మందికి సచివాలయ ఉద్యోగులు ఇంటికే వెళ్లి పింఛన్ అందించారు. వారికి వృద్ధాప్య, దివ్యాంగ, పక్షవాతం, డయాలసిస్ తదితర పెన్షన్లు అందించారు.

### ఇంటికే వచ్చి ఇచ్చారు



ప్రతినెలా వలంటీర్ వచ్చి పెన్షన్ అందించేవారు. ఈనెల వలంటీర్లను పక్కన పెట్టడంతో రాలేదు. నేను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాను. వలంటీర్ లేకపోవడంతో పెన్షన్ రాదనుకున్నాను. కదలలేని స్థితిలో ఉండటంతో సచివాలయ సిబ్బంది మా ఇంటికే వచ్చి పెన్షన్ అందించారు. చాలా ఆనందంగా ఉంది.

– నిమ్మల గంగాజలం, కాళ్ల

### చాలా సంతోషం



నా వయసు 80 ఏళ్లు దాటింది. కదలలేని స్థితిలో ఉన్నాను. వలంటీర్ పింఛన్ తీసుకురాకపోవడంతో నా పరిస్థితి ఏంటని ఆందోళన చెందాను. ఈ నెల పెన్షన్ రాదనుకున్నాను. అయితే సచివాలయ సిబ్బంది మా ఇంటికే వచ్చి పెన్షన్ డబ్బులు అందించారు. చాలా సంతోషంగా ఉంది.

– లక్కోజి భాస్కరమ్మ, 39వ వార్డు, భీమవరం

### మంచం పైనే పెన్షన్



పక్షవాతంతో కొంత కాలంగా మంచంపై ఉంటున్నాను. ప్రతినెలా వలంటీర్ ఇంటికే వచ్చి పెన్షన్ అందించేవారు. ఈనెల సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని తెలిసింది. నేను ఎలా వెళ్లగలనని ఆందోళన చెందాను. అయితే సచివాలయ ఉద్యోగి ఒకరు మా ఇంటికే వచ్చి పెన్షన్ అందించారు.

– రావుపాటి అన్నపూర్ణమ్మ, తూర్పుపాలెం

### ఆదర్శనీయులు జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ ఆదిత్య

**భీమవరం(ప్రకాశంచౌక్):** బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన ఆదర్శనీయులు బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్ మహాత్మాగాంధీతో కలిసి క్విట్ ఇండియా, స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నారని కలెక్టర్ అన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ సమాజంలో సమానత్వం సాధించేందుకు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు స్త్రీ విద్యకు జగ్జీవన్ అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. జగ్జీవన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ పిల్లలను బాగా చదివించాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.శోభారాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ● ఆశాజ్యోతి జగ్జీవన్

సంఘ సంస్కర్త, బడుగుల ఆశాజ్యోతి, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని ప్రజాప్రతినిధులు కొనియాడారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. పలువురు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం రూరల్ : పడాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



భీమవరం: భీమవరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



తణుకు టౌన్: తణుకు మండలం దువ్వలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

## క్లుప్తంగా

### గోతిలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు



జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలో రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన బస్సు

**బుట్టాయగూడెం(జీలుగుమిల్లి):** జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలో జంగారెడ్డిగూడెంకు చెందిన స్కూల్ బస్సు శుక్రవారం రోడ్డు మార్జిన్ గోతిలోకి దూసుకెళ్లింది. బస్సులో 15 మంది విద్యార్థులున్నప్పటికీ విద్యార్థులకు ఏమీ కాకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

### నగదు స్వాధీనం



గణపవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుభాష్, తనిఖీ అధికారులు

**గణపవరం:** గణపవరంలో శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఒక వ్యక్తి నుంచి రూ.1,38,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎంవీ సుభాష్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల కన్నా ఎక్కువ నగదు గుర్తించడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

**రూ.79 వేలు పట్టివేత**

**కామవరపుకోట:** కామవరపుకోట చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో రూ.79 వేల నగదు దొరికిందని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జె.వి.ఆర్.రమేష్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 102 తనిఖీ చేశామని, ఈ చెక్‌పోస్ట్‌లో ఇంతవరకు రూ.9 లక్షలు స్వాధీన చేసుకున్నామన్నారు.

### సారా బట్టీలపై పోలీసుల దాడులు



వేలేరు శివారు అటవీ ప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేసిన దృశ్యం

**కుక్కునూరు:** నాటు సారా బట్టీలపై కుక్కునూరు పోలీసులు దాడులు నిర్వహించారు. వేలేరు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఈ దాడుల్లో 70 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# నమాజులో ఆరోగ్య సూత్రాలు

**చింతలపూడి :** ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఆచరించే నమాజులో ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య సూత్రాలు దాగిఉన్నాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో కఠోర ఉపవాసం ఉండే ముస్లింలు ఎక్కువ పర్యాయాలు నమాజ్ చేస్తారు. ఇలా నమాజ్ చేయడం వల్ల భగవంతుడి కృపతో పాటు వ్యాయామం వల్ల ఆరోగ్య పరంగా ఎన్నో మంచిదని ముస్లిం పెద్దలు సూచిస్తున్నారు. నమాజులోని ప్రతి క్రియలోనూ వ్యాయామ గుణాలు అధికంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు అవకాశాలు ఎక్కువని చెబుతున్నారు. వేకువ జామునే నిద్ర లేచి నమాజు ప్రక్రియను ప్రారంభిస్తారు. నమాజులో తక్బీర్, ఖియామ్, రుకూ, సజ్దా, సలాం, వంటి ప్రక్రియలను వివిధ భంగిమలతో ఆచరిస్తారు. దీంతో మానవుని అన్ని అవయవాలకు వ్యాయామం జరిగి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.



### తక్బీర్



నమాజ్ చేయడానికి ముందు (నియ్యత్ చేసి) అల్లాహు అక్బర్ అంటూ తన రెండు చేతులను చెవుల వరకు పైకెత్తి కిందికి దించి నాభి పైన రెండు చేతులను కట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిష్కల్మష చిత్తంతో మనసును దేవునిపై లగ్నం చేసి ఆరాధించే అవకాశం లభిస్తుంది.

### దుఆ

నమాజు అనంతరం అల్లాహ్‌ను దుఆ (ప్రార్థన ) చేయడంతో నమాజు ముగుస్తుంది. నమాజ్‌ను క్రమం తప్పకుండా చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెరగడంతో పాటు శరీర బరువు తగ్గడం, పలు రుగ్మతలు తగ్గుతాయి.

### సలాం

నమాజు పూర్తయ్యే సమయంలో తలను ఒకసారి కుడి వైపుకు తిప్పి అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్ అని మరోసారి ఎడమ వైపునకు తిప్పి అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహ్ అని చెప్పి నమాజును ముగిస్తారు. దీనివల్ల గొంతుకు, మెడకు మంచి వ్యాయామం లభిస్తుంది. మెదడు ఉత్తేజమవడంతో పాటు కంటిచూపు బలపడుతుంది.

### రుకూ



రెండు చేతులు మోకాళ్ళపై ఉంచి నడుమును సమాంతరంగా ఉంచాలి. చూపును రెండు కాళ్ళ బొటన వేళ్లపై కేంద్రీకరించాలి. ఈ క్రియ ఉదర భాగానికి, వెన్నెముకకు ఉత్తమ వ్యాయామాన్ని ఇస్తుంది.

### ఖియాం



రెండు చేతులను బొడ్డు మీదికి వచ్చేటట్టు కట్టుకోవాలి. ఇది నమాజులో విధిగా ఆచరించే భంగిమ. దీనివల్ల ఏకాగ్రత లభిస్తుంది. నిటారుగా నిలబడటం వల్ల శరీర భాగాల్లో రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

### సజ్దా



పాదాలు, అరచేతులు, మోకాళ్ళు, ముక్కు, నుదురు వీటిని నేలను తాకేలా ఉంచి దైవానికి సాష్టాంగ ప్రమాణం చేయాలి. ఈ భంగిమ ద్వార శరీర అవయవాలన్నింటికీ మంచి వ్యాయామం లభిస్తుంది. ముఖ్యంగా ఛాతీకి, భుజాలకు మంచి వ్యాయామం.

### జల్సా



సజ్దా అనంతరం రెండు మోకాళ్ళను మడిచి మోకాళ్ళపై చేతులు ఉంచి కూర్చుంటారు. ఈ క్రియ వజ్రాసనాన్ని పోలి ఉంటుంది. శరీరంలోని 72 వేల నాడులపై ఇది ప్రభావం చూపుతుంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత పెరుగుతుంది.

# వలంటీర్ల రాజీనామాలు

**ఆకివీడు:** వలంటీర్లుగా సేవలందించి ప్రజలు మన్ననలు పొందిన మేమంతా ప్రతిపక్ష పార్టీలు ఈర్ష్య, ద్వేషాలకు బలై రాజీనామాలు చేస్తున్నామని స్థానిక సచివాలయం-3కు చెందిన 19 మంది వలంటీర్లు చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం రాజీనామా పత్రాల్ని ఎంపీడీఓకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాభావాన్ని తమకు అలవర్చిన జగనన్నకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

**కలిదిండి మండలంలో..**

**కలిదిండి :** వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. కలిదిండి మండలం చినతాడినాడ గ్రామ సచివాలయానికి చెందిన 13 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలు చూపుతూ శుక్రవారం రాజీనామాలు చేశారు. ఐదు సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవ్వా తాతలకు పింఛన్లు పంపిణీ చేసిన వలంటీర్లపై నిబంధనలు పెడుతూ ఆదేశాలు ఇవ్వడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో తాము ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విజయానికి కృషి చేస్తామని చెప్పారు.



పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెంలో రాజీనామా చేసిన వలంటీర్లు

**పెనుమంట్ర మండలంలో..**

**పెనుమంట్ర:** మండలంలో వలంటీర్ల రాజీనామాలు శుక్రవారం కూడా కొనసాగాయి. పెనుమంట్ర మండలంలో 12 గ్రామ పంచాయతీలకు చెందిన 206 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి, రాజీనామా పత్రాలు సమర్పించారని ఎంపీడీవో పద్మజ తెలిపారు. ఎస్.ఇల్లిందలపర్రులో 11 మంది, పాలమూరులో 30, ఆలమూరులో 18, ఓడూరులో 7, పెనుమంట్రలో 29, మాముడూరులో 12, నెగ్గిపూడిలో 19, మార్టేరులో 33, వెలగలవారిపాలెంలో 9 మంది వలంటీర్లు తమ రాజీనామాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.



ఆకివీడు సచివాలయం-3లో రాజీనామా పత్రాల్ని ఎంపీడీఓ రామకృష్ణకు అందజేస్తున్న వలంటీర్లు

**అత్తిలి మండలంలో..**

**అత్తిలి :** మండలంలో వలంటీర్ల రాజీనామా కొనసాగుతోంది. శుక్రవారం పాలూరు, లక్ష్మీనారాయణపురం, స్కిన్నెరపురం, వరిఘేడు గ్రామాలలో వలంటీర్‌లు రాజీనామా చేసి, రాజీనామా పత్రాలను గ్రామ పంచాయితీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవ చేస్తున్న వలంటీర్‌ల ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారం తట్టుకోలేక రాజీనామా చేశామన్నారు.



కలిదిండి మండలం చినతాడినాడలో రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న గ్రామ వాలంటీర్లు



అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురంలో రాజీనామా చేసిన వలంటీర్లు

### అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కమిటీని అభినందిస్తున్న దృశ్యం

**ఏలూరు(మెట్రో):** ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం ఏలూరు అగ్రికల్చర్ జేడీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వీఎన్ఆర్ గంగాధర్, కార్యదర్శిగా ఎండీ రఫీ, కోశాధికారిగా బి.రాకేష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, రాష్ట్ర సెక్రటరీ ప్రసాద్, ఎన్నికల అధికారులుగా డీఎస్ఎస్ శ్రీనివాస్, సాయి కుమార్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గంలో ఎన్నికైన సభ్యులకు జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అభినందనలు తెలిపారు. నూతన కమిటీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని, వారి శ్రేయస్సు కోసం పాటుపడతానని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవో అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి నేరుసు రామారావు అభినందనలు తెలిపారు.

### విద్యుత్ లైన్‌మేన్ సస్పెన్షన్

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక సత్రంపాడులో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో ఎనర్జీ అసిస్టెంట్ గాయపడిన ఘటనలో సీనియర్ లైన్‌మేన్‌ను సస్పెండ్ చేస్తూ ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 12న స్థానిక సాత్రంపాడు పరిధిలో ఒక ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫిర్యాదుపై విద్యుత్ సరఫరాను పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్ళారు. ఈ సందర్భంగా స్థానిక లైన్‌మెన్ కొత్తపల్లి రామకృష్ణ, విద్యుత్ స్తంభం ఎక్కి సమస్య పరిష్కరించాల్సి ఉండగా ఆ పరిధిలో పని చేసే ఎనర్జీ అసిస్టెంట్ అర్జా వినోద్ బాబును స్తంభం ఎక్కించి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేయించారు. సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యుత్ సరఫరా చేశారు. దీంతో స్తంభంపై పని చేస్తున్న వినోద్‌బాబు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. ఘటనకు సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నటరాజన్ తెలిపారు. ఈ ఘటనలో మహిళా అధికారిపై విచారణ చేస్తున్నట్లు సమాచారం.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**భీమడోలు:** రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆగడాలలంకకు చెందిన భలే ఆనందరావు (48) ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఆనందరావు ఆగడాలలంకలో గత నెల 15న మోటార్ బైక్‌పై వెళ్తుండగా అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన ఆనందరావును విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన మృతిపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టారు.



### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలి



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

**ఏలూరు (టూటౌన్):** రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో వెట్టి చాకిరి నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, కార్మిక శాఖలు, సీడబ్ల్యూసీ, ప్యానల్ లాయర్లతో కలిసి దిశా పోలీస్ స్టేషన్ నుంచి అవగాహన ర్యాలీని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ప్రారంభించారు. ఏలూరు పట్టణంలోని దుకాణాల్లో పని చేస్తున్న కార్మికుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ వెట్టి చాకిరి, బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతుందన్నారు. దీని నిర్మూలనకు అన్ని వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయసహాయాన్ని అందిస్తుందన్నారు. డీసీపీఓ సూర్యచక్రవేణి మాట్లాడుతూ సమాజంలో ప్రతి పౌరుడికి ఈ వెట్టి చాకిరి, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాల్సిన బాధ్యత ఉందన్నారు. 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాధితులకు రక్షణ, పునరావాసం ఏర్పాటు చేయడమేకాకుండా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దిశ సీఐ విశ్వం, అసిస్టెంట్ లేబర్ అధికారి గోపాల కృష్ణారావు, ప్యానల్ లాయర్ కూన వెంకట కృష్ణారావు, జీవీ భాస్కరరావు, దిశ ఎస్ఐ కాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

### తాడేపల్లిగూడెం శశిలో 7న అవగాహన సదస్సు

**తాడేపల్లిగూడెం:** పట్టణంలోని శశి క్యాంపస్‌లో ఏప్రిల్ 7వ తేదీన ఆదివారం 6వ తరగతి నుంచి 10+1 విద్యార్థుల కోసం ఐఐటీ జేఈఈ, నీట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. క్యాంపస్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన హాస్టల్ క్యాంపస్ ప్రారంభిస్తున్నామని విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మేకా క్రాంతి సుధలు వివరించారు.

### వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

**భీమవరం:** విశాఖ డెయిరీ సొమ్మును సొంతానికి వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. నరసయ్య అగ్రహారం ప్రాంతానికి చెందిన కర్రి మాధవ్ విశాఖ డెయిరీ సంస్థలో డబ్బులు కలెక్షన్ చేస్తుంటాడు. ఆ సొమ్ములో సుమారు రూ.42.76 లక్షల మొత్తాన్ని వాడుకోవడంతో సంస్థ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# తీవ్ర ఉష్ణోగ్రతలో ధాన్యం ఆరబెట్టొద్దు

- మిల్లింగ్‌లో బియ్యం నూకగా మారే ప్రమాదం
- పైరు కర్ర పచ్చిగా ఉండే సమయంలోనే కోత ఉత్తమం
- దాళ్వా ధాన్యం ఆరబెట్టడంపై జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయ నిపుణులు

పాడి-పంట



**భీమవరం:** జిల్లాలో దాళ్వా మాసూళ్లు ప్రారంభమయ్యాయి. పైరు ఆశాజనకంగా పెరగడంతోపాటు పెద్దగా చీడ, పీడలు, ఎలుకల బెడద లేకపోవడంతో మంచి దిగుబడి వస్తోంది. ఇప్పటికే తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు తదితర మండలాల్లో మాసూళ్ల ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న రైతులు కళ్లాలు, రోడ్ల వెంబడి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. అయితే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ధాన్యం అధికంగా ఎండితే బియ్యం ముక్కలయ్యే ప్రమాదం ఉంది. దీని వల్ల రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోడానికి నిరాకరించే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా వరిసాగు చేయగా ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1121 రకాన్ని సాగుచేశారు. మరికొంతమంది పీఆర్ 126, ఎంటీయూ 1153, 1156 రకాలను పండించారు. ప్రస్తుతం మాసూళ్లు చేస్తున్న ప్రాంతాల్లో ఎకరాలకు 65 బస్తాల వరకు దిగుబడి వస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా 9.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా.

**ధాన్యం ఎండబెట్టడంతో ఈ జాగ్రత్తలు తీసుకుందాం..**

దాళ్వా సీజన్‌లో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య మిల్లింగ్‌లో గింజ విరిగిపోయి నూక ఎక్కువగా రావడం వల్ల ధరపై ప్రభావం చూపుతోంది. అందువల్ల కోత కోసే సమయంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వరికంకుల్లో 90 శాతం గింజలు పసుపురంగుకు మారుతున్నప్పుడు కర్ర పచ్చిపై ఉండగానే పంటను కోయాలి. గింజల్లో తేమ తగ్గించడానికి 5 రోజులు పనలను చేనుపైనే ఎండనివ్వాలి. పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉండడంతో కంకిలోని చివరి గింజలు పూర్తిగా నిండుకోక మిల్లింగ్ చేసినపుడు అధికంగా నూక అయ్యే అవకాశముంది. పంటను సకాలంలో కోత కోయలేకపోతే గింజలు వరి యంత్రాలతో మాసూళ్లు చేస్తే చెత్త, దుమ్ము, మట్టిబెడ్డలు వంటివి ధాన్యంలో తగ్గుతాయి. ధాన్యంలో తేమ క్రమక్రమంగా తగ్గాలి. దీనికోసం సాధారణమైన ఎండలో ధాన్యాన్ని పరచి మధ్యమధ్యలో తిరగదిప్పాలి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నపుడు ఆరబెడితే గింజలలో తేమ ఒక్కసారిగా తగ్గి గింజలపై పగుళ్లు వస్తాయి.

**బియ్యంలో నూక ఎక్కువగా రావడానికి ప్రధాన కారణాలు ఇవే..**

పంట పక్వానికి వచ్చినా చేనుపైనే ఎండిపోవాలనే ఉద్దేశంతో కోతను ఆలస్యం చేయడం, కోత కోయడానికి చేను క్రమక్రమంగా కాకుండా ఒకేసారి నీటిని తగ్గించివేయడం. కీలక దశలలో పంట నీటి ఎద్దడికి గురికావడం వల్ల కింద గింజలు పూర్తిగా తోడుకోక నూక ఎక్కువగా వస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వద్ద ధాన్యాన్ని కల్లంలో ఆరబెట్టడం వల్ల గింజలలో తేమ ఒకేసారి తగ్గి నూక శాతం ఎక్కువ వస్తుంది.

**ధాన్యాన్ని ఆరబెట్టడంలో శ్రద్ధ తీసుకోవాలి**



దాళ్వా మాసూళ్ల సమయంలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ధాన్యం ఎక్కువగా ఎండితే బియ్యంలో నూకశాతం అధికంగా ఉంటుంది. అందువల్ల ఎక్కువ ఉష్ణోగ్రతలో ధాన్యాన్ని ఎక్కువ రోజులు ఎండబెట్టకుండా తక్కువ ఎండ తగిలేచోట ఎండబెట్టుకోవాలి. అంతేగాకుండా కోత కోసే సమయంలో కూడా పైరు కర్రపచ్చిగా ఉండగానే మాసూళ్లు చేసుకోవడం మేలు. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని తగినంత ఎండలో ఆరబెట్టుకునేలా చర్యలు తీసుకోవాలి.

– ఎంవీ కృష్ణాజీ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు

**17 శాతం తేమతో ధాన్యం కొనుగోలు**



జిల్లాలో రబీ వరి దిగుబడి ఆశాజనకంగా ఉంది. 2.20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా దాదాపు 9.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. దాళ్వా పంటలో ధాన్యం ఎక్కువగా ఎండడం వల్ల బియ్యంలో నూకశాతం పెరుగుతుంది. 17 శాతం తేమతో ధాన్యం కొనుగోలు చేస్తున్నందున దానికి అనుగుణంగానే ఎండబెట్టాలి. ధాన్యాన్ని ఎక్కువ ఎండలో కాకుండా కొద్దిపాటి ఎండతగిలే విధంగా ఆరబెట్టుకోవడం మేలు.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

## క్లుప్తంగా

### కృష్ణ మందిరంలో ఏకాదశి పూజలు


కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఫాల్గుణ బహుళ (విజయ) ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలోని రామచంద్రరావు పేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శుక్రవారం ఉదయం కృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు, అష్టోత్తర పూజలు, స్వామివారికి నూతన పట్టువస్త్రాలు, అమ్మవారికి విశేష అలంకరణలు జరిగాయి. అదే విధంగా చింతామణిదేవి అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### బలుసులమ్మ ఆలయంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో బలుసులమ్మ అమ్మవారు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద క్రోధి ఉగాది మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 6వ తేదీ శనివారం ఉదయం గణపతిపూజ, గోపూజ, అమ్మవారి గరగల సంప్రోక్షణ, పాతూరులో ఊరేగింపు, పుట్టింటి పాన్పు కార్యక్రమాలు జరుగుతాయని, 2వ రోజు ఆదివారం అమ్మవారి రథోత్సవం, 3వ రోజు సోమవారం సామూహిక లలితా పారాయణం , 4వ రోజు మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారి విశేష అలంకరణ, దివ్య మంగళ రూప దర్శనం, 5వ రోజు బుధవారం శ్రీ చక్ర నివాసినికి, బలుసులమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. అదే విధంగా 12వ తేదీ శుక్రవారం కుంభ నివేదన, ఊంజల సేవ, అన్నసమారాధనలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.

### ముగిసిన స్పెక్ట్రా ఉత్సవం


వాసవీలో సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం మండలం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా సాగుతున్న సాంకేతిక ఉత్సవం స్పెక్ట్రా 2К24లో ముగింపు సందర్భంగా గురువారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో హుషారెక్కారు. సరదా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాల్లో విద్యార్థుల్లోని సృజనాత్మకత బయట పడుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు అబ్బుర పర్చాయని, భవిష్యత్‌లో ఇవి స్టార్టప్‌లుగా మారాలని కోరుకుంటున్నామన్నారు. డిగ్రీ ఎలా పూర్తి చేశామన్నది ప్రధానం కాదు ,విద్యార్థులు ఏం నేర్చుకున్నారనేది జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు కార్యక్రమ కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు అభినందించారు.

### కంచుమర్రులో ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**అత్తిలి:** కంచుమర్రు గ్రామంలో బల్లవారి వీధిలో నూతనంగా నిర్మించిన కృష్ణాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరైయ్యారు. కృష్ణ భగవానుడికి మంత్రి కారుమూరి ప్రత్యేక పూజలు చేశారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో కృష్ణాలయం నిర్మించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### క్రీడాపోటీలు మానసిక వికాసానికి దోహదం

**భీమవరం:** క్రీడాపోటీలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహద చేస్తాయని భీమవరం వన్ టౌన్ సీఐ అడబాల శ్రీను, టుటౌన్ సీఐ జె శ్రీనివాస్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరంలోని అనసూయ అకాడమీలో నిర్వహించిన అండర్-17 ఓపెన్ బాలురు, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా పిల్లల ఆసక్తి మేరకు తల్లిదండ్రులు వివిధ రంగాల్లో తర్ఫీదు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, మాదాసు రవి పాల్గొన్నారు.

# సంక్షేమ సారథికి పట్టం కట్టండి

**అత్తిలిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మంత్రి కారుమూరి**


అత్తిలిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**అత్తిలి:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పట్టం కట్టాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అత్తిలి తెనుకులవారికళ్లం ప్రాంతంలో మంత్రి కారుమూరి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా వినాయకుని ఆలయంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచార యాత్రలో మంత్రి కారుమూరికి మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు జరిగే సంక్షేమ పథకాలను అందిస్తుంటే నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లను వారి సేవలకు దూరం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు చేసిన దుర్మార్గపు ఆలోచన వల్లే పింఛన్ సొమ్ము ఇంటి వద్దకే అందించలేక పోయారని చెప్పారు. ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, పార్టీనాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. అత్తిలి గ్రామ వాసిగా గ్రామాభివృద్ధికి అన్నివిధాలా అండగా ఉంటానని చెప్పారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రంభ సూరిబాబు, గంటా నాగరాజు, కాసగాని అబ్బులు, కాసగాని చిన్నా, సబ్బితి రాజేష్, కంకటాల సతీష్, రామిశెట్టి రాము, గంటా నాగరాజు, రంభ రాంబాబు, దాసరిశ్రీనివాస్, ఆకుల చినబాబు, యడ్లపల్లి దుర్గారావు, మద్దాల రమణ, యడ్లపలి మణికుమార్, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు కసిరెడ్డి బాలాజీ, శింగంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తణుకును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా


చాంబర్ కామర్స్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**తణుకు టౌన్:** తణుకు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రాబోయే ఎన్నికలలో తన గెలుపుకు సహకరించాలని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులను కోరారు. శుక్రవారం రాత్రి తణుకులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తణుకు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి తణుకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మాజేటి సూర్య ప్రకాశ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలలో కొనుగోలు శక్తి పెరిగి వ్యాపారాలు లాభసాటిగా సాగాయన్నారు. సంక్షేమ పథకాలను ప్రత్యక్షంగా బ్యాంక్‌లో జమ చేయడం ద్వారా అవినీతి తగ్గి డిజిటల్ లావాదేవీలు పెరిగాయని చెప్పారు. దేశంలో అత్యదిక జీడీపీ ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో పేదరికం 11 శాతం నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. వ్యవసాయం రంగం 3 శాతం నుంచి 11 శాతానికి వృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో విద్యా రంగం అభివృద్ధికి నాడు-నేడు ద్వారా రూ. 70 వేల కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. తణుకు పట్టణంలోని వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. అతఈకార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి రాకేష్, కోశాదికారి కేదారేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అద్యక్షుడు మంగెన సూర్య, ఉపాధ్యక్షుడు మానేపల్లి శేఖర్, జల్లూరి జగదీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ సీఎం జగన్ గెలుపు ఖాయం

**మంత్రి కారుమూరి నాగేశ్వరరావు**


పేకేరులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

**ఇరగవరం:** మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్ని జాతీయ సర్వేలు చెబుతున్నాయని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పేకేరు, తూర్పువిప్పర్రు శివారు నారాయణపురం, ఇరగవరం, గోటేరు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడు లేనివిధంగా సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమ పాలన సాగించారన్నారు. హామీలన్నీ నెరవేర్చి ప్రజలను ధైర్యంగా ఓట్లడిగే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్ర, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ భవనాలు, నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగించారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటికే పాలన చేరువ చేశారన్నారు. మహిళలకు డ్వాక్రా రుణ మాఫీ, ఇంటి పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో మూడు కండువాతో వచ్చి ప్రజలను మోసం చేసే నాయకులను నమ్మవద్దని కోరారు. ఎన్నికల్లో ఒక ఓటు ఎమ్మెల్యేగా తనకు, రెండో ఓటు ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ముందుగా పేకేరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు సత్తి సత్తి బాబు, పెన్మెత్స రామభద్రరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ వెలగల సాయిబాబారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సత్తి వెంకటరెడ్డి, చోడే జోషి, గుడిమెట్ల సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు గుడిమెట్ల అదిలక్ష్మి,బెల్లంకొండ హేమ కుమారి, ఎంపీటీసీలు, నాయకులు, బెల్లంకొండ సురేష్, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, మామిడిశెట్టి శ్రీను, సైపురెడ్డి పెద్దిరాజు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

**తాడేపల్లిగూడెం రూరల్:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగు జాడల్లో మనమంతా నడవాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పడాల గ్రామంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు సైతం వెళ్లడానికి వెనుకాడని ధీరుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఆయన చనిపోయేంత వరకు మంత్రి పదవిని నిర్వహించారన్నారు. గొప్ప పార్లమెంటేరియన్‌గా జగ్జీవన్‌రామ్ వ్యవహరించారన్నారు. ఆయన ప్రధానంగా ఆహారం, వ్యవసాయం వంటి శాఖలను నిర్వహించారన్నారు. నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రివర్గంలో ఆయన పనిచేసి, వారందరికీ అండగా నిలిచారన్నారు. ఆయన వారసురాలు మీరాకుమార్ సైతం మంచి స్పీకర్‌గా పేరు తెచ్చుకున్నారన్నారు. జగ్జీవన్‌రామ్ మృతి చెందినా, అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకుడు కళింగ లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కమిటి అధ్యక్షుడు గెద్దం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఈరి కొండారత్నం, కార్యదర్శి పెనుమాక మోషేన్, కోశాధికారి పోసిబోయిన బాబూరావు, గారపాటి నానాజీ, పులి గోపాలకృష్ణ, కామిశెట్టి వినోద్, పులి ప్రసాద్, కారింకి వీర్రాజు, కట్టుబోయిన కృష్ణప్రసాద్, మండల యూత్ అధ్యక్షుడు ములకాల రాంబాబు, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


కడకట్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ నాయకులు


బిళ్లగుంట గ్రామంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్


తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి**

**తణుకు టౌన్:** బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని తణుకు రూరల్ మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రచించిన రిజర్వేషన్‌లను సమర్థవంతంగా అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సరెళ్ల సతీష్, సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను, విగ్రహ కమిటీ సభ్యులు మానేపల్లి సంపత్‌రావు, ప్రభాకరరావు, శ్యామ సోమరాజు, కొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. దువ్వ గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో మంత్రి కారుమూరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, మండల రైతు విభాగం అధ్యక్షుడు డి కృష్ణంరాజు, ఎంపీటీసీ సభ్యులు పీ అశోక్, శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ సునీల్, శెనగన ఏడుకొండలు, జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు సిర్రా జాన్, కోటి, సుదాకర్ పాల్గొన్నారు. వీరభద్రపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో వేడుకల్లో యూత్ నాయకులు మల్లిపూడి సుదాకర్, బ్రహ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గనసాల సింగ్, సుద్దుల పాండు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ టీ వీరయ్య, సీహెచ్ ప్రసాద్, ఎం వెంకట్రావు, న్యాయవాది కె ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానిమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి అన్నారు. పట్టణంలోని ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్ రామ్ 117వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రొక్కాల ఆశీర్వాదం, కె.కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక కడకట్లలో పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు శీలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధానిమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సభ జరిగింది. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు పాల్గొన్నారు. తొలుత జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆర్.వెంకటేశ్వరరావు, పాస్టర్ సిద్ధిరాజు, శ్రీను, సునీల్, ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దూలం విజయకుమార్ , ఉపాధ్యక్షుడు కంకట శ్రీనివాస్, కార్యదర్శి మల్లీడి గీతా రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఈడా ఫరోత్ బాబు, కోశాధికారి రత్నదీప్, సభ్యులు నయనాల స్వామి, శ్రీనుబాబు, న్యాయవాదులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్**

0ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్ అని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని కంతేరు గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటి హాల్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాలు కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన చూపిన బాటాలో దళితలు ముందుకు వెళ్లాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చేబ్రోలు స్వరాజ్యం, గుడిమెట్ల ఆదిలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, నాయకులు గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి , గుడిమెట్ల వీర్రెడ్డి చేబ్రోలు పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

**బడుగుల ఆశాజ్యోతి జగజ్జీవన్‌రామ్**

**పెంటపాడు:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధుడు బాబూజగ్జీవన్‌రామ్ ఆశయ బాటలో మనమంతా నడవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దర్శిపర్రు శివారు బిళ్లగుంట ప్రాంతంలో బాబూ జగజ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, నిరుపేద కుటుంబంలో మారుమూల కుగ్రామంలో జన్మించి ఉపప్రధానిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయసలహామండలి కమిటీ సభ్యులు జాలపర్తి నాగేశ్వరరావు, కిలాడి రామయ్య, యజ్జల రామారావు, పండు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి**

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో బహుజన సేన సమితి ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశ ప్రజానీకానికి చేసిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం భారతరత్నతో గౌరవించాలన్నారు. మహిళా చైతన్య సేన జిల్లా అధ్యక్షురాలు దిరుసుపాముల పుష్ప, దళిత సేన జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు, తాడేపల్లిగూడెం పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు సందక రమణ, పెదతాడేపల్లి గ్రామ అధ్యక్షుడు దూలపల్లి రాంబాబు, కార్యదర్శి జంపల్లి సుధాకర్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. జగన్నాథపురం గ్రామంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో జగజ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

## విగ్రహ ప్రతిష్ఠలో డిప్యూటీ సీఎం ‘కొట్టు’


కోదండ రామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి శుక్రవారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా కలగాలని ఆకాంక్షించారు. రావిపాటి వేంకటప్రసాద్ (సిద్ధాంతి), వేద పండితుల సమక్షంలో ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. సాయంత్రం శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, ఆలయ కమిటి అధ్యక్షుడు కాసాని సోమేశ్వరరావు, కార్యదర్శి చిట్టూరి రాము, కోశాధికారి చిటకన సతీష్, మల్లెల నాగేంద్ర, అన్నవరం, పిచ్చుకల శ్రీనివాసరావు, కాసాని వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం**

**తాడేపల్లిగూడెం అర్బన్:** పట్టణంలోని చలంచర్ల వీధిలో కోదండరామాలయాన్ని పునఃప్రతిష్ఠ కార్యక్రమం శ్రుకవారం వైభవంగా జరిగింది. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ట్రస్టీ నారాయణ వెంకటరమణారావు, కార్యదర్శి శ్రీనివాస్ శేషావతారం, అబ్బులు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, సొసైటీ చైర్మన్ జడ్డుహరిబాబు, మార్లపూడి సుబ్బారావు, మొలకాల రాంబాబు, కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఆర్డీవో కే.చెన్నయ్య

**తాడేపల్లిగూడెం రూరల్:** నియోజకవర్గంలో 85 ఏళ్లు నిండిన, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి హోం ఓటింగ్‌కు ఈసీ అనుమతినిచ్చిందని, అటువంటి వారి ఓట్లు అధికారుల సమక్షంలో వేయడం జరుగుతుందని ఆర్డీవో కే.చెన్నయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్వోలతో హోం ఓటింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ హోం ఓటింగ్‌కు 12డి దరఖాస్తులను వృద్ధులకు, 40 శాతం వైకల్యం కలిగిన పీడబ్ల్యూడీ ఓటర్లకు అందించాలన్నారు. అవసరమైతే దరఖాస్తులిచ్చే సమయంలో ఫొటోలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఇచ్చే విషయంలో గోప్యత పాటించాలన్నారు. ఈ నెల 14వ తేది లోపు కొత్త ఓటరు దరఖాస్తులు, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. శాశ్వత నివాసితులకు మాత్రమే ఓటు హక్కు జారీ చేయాలన్నారు. మే 7వ తేది లోపు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయాలన్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# వైఎస్సార్ సీపీలో చేరికలు


వైఎస్సార్ సీపీలో చేరుతున్న మహిళలు

**తాడేపల్లిగూడెం అర్బన్:** స్థానిక 1వవార్డులోని మహిళలు వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరారు. వారిని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు, కుమార్తె బాలరాజేష్, కాంచనలు సాధారంగా పార్టీ కండువాలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు జగన్ పాలనను ఇష్టపడి పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. శాంతిభద్రతలతో ప్రశాంత జీవనం సాగాలంటే కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఓటు వేసే సమయంలో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వీరివెంట బోళం రామలక్ష్మి, దింటకుర్తి లీలావతి, వైఎస్సార్ సీపీ 1వ పట్టణం కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, అడ్డాల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.